ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 44.0
కనిష్ఠం : 23.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:27 (శని)
సహరి : 4:32 (ఆది)

రైతులను ఆదుకుంటాం





నరసాపురం, పాలకొల్లు ప్రజాగళం సభల్లో చంద్రబాబు

యువత వ్యక్తిగత నైపుణ్యం పెంచుకోవాలి.. పాలకొల్లులో ఐటీ పార్కు.. టీడీపీ కార్యకర్తల రుణం తీర్చుకుంటాం

భీమవరం/నరసాపురం/పాలకొల్లు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): 'అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. పార్టీ కార్యకర్తలు జెండాలు మోశారు. పొత్తులో మిత్రపక్షాలకు సీటు ఇచ్చినా జెండాను వీడలేదు. ఇలాంటి కార్యకర్తలకు, నాయకుల సేవలను మర్చిపోను. వీరికి గుర్తింపునిచ్చే బాధ్యత నాది' అంటూ చంద్రబాబు శుక్రవారం నరసాపురం, పాలకొల్లులో జరిగిన ప్రజాగళం సభల్లో మాట్లాడారు. ఈ సభలకు జనం వేలాదిగా తరలివచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమా నులతో సభా ప్రాంగణాలు కిక్కిరిపోయాయి. నరసాపురంలో ఎండను సైతం లెక్క చేయకుండా చంద్రబాబు కోసం మహి ళలు నిరీక్షించారు. పసుపు చీరలు ధరించి, జెండాలు చేతబట్టి వేదిక వద్దకు వచ్చారు. చంద్రబాబును చూడగానే యువత, మహిళలు ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. స్థానిక సమస్య లను చంద్రబాబు ప్రస్తావించారు. ఆగస్టులో టిడ్కో ఇళ్లల్లో గృహ ప్రవేశం చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాలకొల్లు సభకు జనం వేలాదిగా తరలిరావడంతో చంద్రబాబు ఎంతో ఉత్తేజం, ఉత్సాహంతో ప్రసంగించారు. మహిళలకు, యువతకు, చిన్నారులకు అభివాదం చెప్పి చిరునవ్వులు చిందించారు.

పాలకొల్లు సభ నిర్ణీత సమయానికంటే గంట ఆలస్యంగా చంద్రబాబు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. వేలాది సంఖ్యలో మహిళలు యువకులు పార్టీ అభిమానులు కార్యకర్తలు నాలుగు గంటలు సమయం వేచి ఉన్నారు. సభలో నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుకు చంద్రబాబు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఐదేళ్లుగా జగన్ సైకో పాలనలో రఘురామను ఎన్ని ఇబ్బందులకు గురిచేశారో గమనిస్తే ప్రజాస్వామ్యంలో ఉన్నామా అని అనిపిస్తుందన్నారు. ఒక ఎంపీని చిత్రహింసలకు గురిచేసి తన పార్లమెంట్ నియోజకవర్గంలోకి రాకుండా జగన్ అడ్డు పడ్డాడని దుయ్యబట్టారు. న్యాయం కోసం పోరాడితే.. గట్టిగా మాట్లాడితే పోలీసులను, సీబీసీఐడీని ఉసిగొల్పి ఆస్తులను ధ్వంసం చేసి అరెస్టు చేయడం ఇవే సైకో జగన్‌కు తెలుసని బాబు విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి కోసమే మూడు పార్టీలు కలవడం జరిగిందని బాబు చెప్పారు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో రెండు

- ఐదేళ్లుగా జగన్ సైకో పాలనతో అన్నీ ఇబ్బందులే..
- ఎంపీ రఘురామను చిత్రహింసలకు గురిచేశారు
- నాకు రాజకీయమంటే సేవ.. జగన్‌కు అరాచకం, దోపిడీ
- గోదావరి జిల్లాల్లో మాల మాదిగలకు ఎమ్మెల్సీలు ఇస్తాం
- ముదునూరి మహాముదురు.. ఇసుకలో కోట్లు దోచేశాడు
- ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలి



నరసాపురం సభకు తరలివచ్చిన జనం

బటన్‌లు నొక్కాలని సైకిల్, కమలం గుర్తులకు ఓటు వేయాలి. మా దృష్టిలో రాజకీయం అంటే సేవ, అదే జగన్ దృష్టిలో అరాచకం, దోచుకోవడం' అని మండిపడ్డారు. ఆర్య వైశ్యులు ఉదార స్వభావులు. దాతృత్వంలో ముందుగా ఉంటా రని అభివర్ణించారు. రైతులకు కౌలు రైతులకు, కూలీలకు న్యాయం చేస్తాం. రైతు కూలీల అభివృద్ధికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ దూసుకుపోతోంది. దీనికి దీటుగా నేటి యువత ఏదో సంపత్తిని పెంచుకోవాలి. ఇందుకు అవసరమైతే పాలకొల్లులోనే ఐటీ పార్కును ఏర్పాటు చేస్తామని హర్షధ్వానాల మధ్య బాబు హామీ ఇచ్చారు. మా హయాంలో పోలవరం 70 శాతం పూర్తి చేస్తే అనంతరం గోదావరిలో కలిపేశారు. వలంటీర్లు రాజీనామాలు చేయొద్దని, మళ్లీ ఉద్యోగాలు రావు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మాల మాదిగలకు ఒక్కొక్కటి చొప్పున ఎమ్మెల్సీలు ఇస్తామని హామీ ఇచ్చారు.

రైతులను ఆదుకుంటాం

'గోదావరి జిల్లాల పేరు చెబితే అన్నదాతలు గుర్తుకు వస్తారు. దేశానికి అన్నం పెట్టిన చరిత్ర ఈ జిల్లాలది. కాని, జలగన్న అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. లంచాలు ఇచ్చి ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోంది. పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. వేలాది ఎకరాలు



నరసాపురంలో హెలీకాప్టర్ దిగుతున్న చంద్రబాబు

బీడుగా మార్చారు. మా హయాంలో ఆక్వా రంగాన్ని దేశంలోనే నెంబర్‌గా నిలిపాం. నేడు ఈ రంగం సంక్షోభంలో కూరుకుపోయింది. రైతుల కష్టాన్ని పట్టించుకునే నాధుడే లేడు. పేరుకే సబ్సిడీ కరెంట్. యూనిట్‌కు రూ.4.50 పైసలు దోచేస్తున్నాడు. మేం అధికారంలోకి రాగానే అందరికి రూపాయిన్నరకే అందజేస్తాం. మహిళలకు స్వయం ఉపాధిని కల్పించింది టీడీపీ. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశాం. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళలకు నెలకు రూ.1500 ఇస్తాం. ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తాం. పెళ్లి కానుక అమలు చేస్తాం. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తాం. ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఏటా చెల్లిస్తాం. చంద్రబాబు మహిళలకు హామీల వర్షం కురిపించాడు.

ముదునూరి.. మహాముదురు

'నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అవినీతిలో మహాముదురు. అడ్డంగా దోచుకుని కోట్లు సంపాదించాడు. మెడికల్ కాలేజీ అంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా డు. పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి లంచాలు గుంజాడు. ఇసుకలో రూ.30 కోట్లకు పైనే దోచేశాడు. ఏటిగట్టుకు నాసి రకం పనులు చేసి కోట్లు కొల్లగొట్టాడు. ఇక్కడ లే అవుట్లు వేయాలంటే ముదునూరికే ముడుపులు చెల్లించాలి. మేం అధికారంలోకి రాగానే ఇలాంటి అవినీతి పరులను విడిచిపెట్టం. దోచుకున్నదంతా కక్కిస్తాం' అని

పాలకొల్లులో భారీగా తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబు, చిత్రంలో ఎంపీ రఘురామ కృష్ణంరాజు, ఎమ్మెల్యేలు నిమ్మల, మంతెన

జాబు రావాలంటే ఎన్డీఏ రావాలి. గంజాయ్ కావాలంటే జగన్ రావాలి. గంజాయ్ పోవాలంటే జగన్ పోవాలి. జగన్ వంటి దుర్మార్గుడు పంపించే అవినీతి డబ్బుకు ఆశ పడవద్దు. మీకు పని చేసే నిమ్మల వంటి సేవకుడిని ఎన్నుకోండి.

- చంద్రబాబు



పాలకొల్లు సభలో బాబుకు బాలుడి విజయకేతనం

నరసాపురం సభలో చంద్రబాబు అన్నారు. నరసాపు రంలో మాట్లాడి చాలా కాలమైంది. మీ అభిమానం ఏమి తగ్గలేదు. దీన్ని నేను మరిచిపోను. ఈ పట్టణాన్ని అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకుంటా. అధికారంలోకి రాగానే రక్షిత మంచినీటి పథకాలు నిర్మించి ప్రతి ఇంటికి కుళాయి ఇస్తా. పట్టణంలో అండర్ డ్రైనేజీ నిర్మిస్తాం. పీఎం లంక వద్ద సముద్ర కోత నివారణకు రక్షణ గోడ నిర్మిస్తాం. బియ్యపుతిప్ప హార్బర్, వశిష్ఠ వంతెన నిర్మాణం పూర్తి చేస్తా. పేరుపాలెంను పర్యాటక ప్రాంతం గా అభివృద్ధి చేస్తా. ఈ ప్రాంత మత్స్యకారుల జీవితాల్లో వెలు గులు నింపుతా. నరసాపురం ఎమ్మెల్యే అభ్యర్థి నాయకర్ గుర్తు గ్లాస్‌పై నొక్కేనొక్కుడు జగన్ గుండెల్లో దిగాలి. ఎంపీ అభ్యర్థి వర్మ గుర్తు కమలంపై ఓటు వేయాలని కోరారు. కూటమి నుంచి జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ నరసా పురం నుంచి ముదునూరి ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలిచారు. ఇక్కడ ఆయన చేసిన అభివృద్ధి ఏమీ లేదు. నాకు ఒక్క అవకాశం ఇవ్వండి, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తా నన్నారు. బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి శ్రీనివాసవర్మ మాట్లాడు తూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలకు చేసింది ఏమి లేదు. బీజేపీ అమలు చేసిన సంక్షేమ పథకాలకు పేర్లు మార్చి స్టిక్క ర్లు వేసుకుని మనుగడ సాగించిందని ఎద్దేవా చేశారు.

మరోసారి ఆశీర్వదించండి : నిమ్మల

'ప్రజలకు రాత్రింబవళ్లు ఏ కష్టం సమస్య ఎదురైనా పిలిస్తే వచ్చి సేవకునిగా పనిచేస్తున్నా. మరోసారి మీ బిడ్డగా ఆశీర్వదించి గెలిపించాల'ని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ప్రజలను కోరారు. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేసి టిడ్కో గృహాలను అందరికీ ఉచితంగా అందిస్తామన్నారు. అసంపూర్తిగా నిలిచిన గౌడ శెట్టి బలిజ కల్యాణ మండపాలు, వంద పడకల ప్రభుత్వాసుపత్రి, ఎన్టీఆర్ కళా క్షేత్రం, ఉద్యాన వనం, షాదీ ఖానా వంటి ఎన్నో పనులను పూర్తి చేస్తానని సభలో హామీ



నరసాపురం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు, చిత్రంలో ఎంపీ అభ్యర్థి వర్మ, ఎమ్మెల్యే అభ్యర్థి నాయకర్, సుబ్బారాయుడు, కొవ్వలి నాయుడు, పొత్తూరి రామరాజు తదితరులు

ఇచ్చారు. స్థానిక సంస్థల్లో జగన్‌రెడ్డి బీసీలకు రిజర్వేషన్ 27 శాతానికి తగ్గించాడు. మళ్లీ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తాం. కులాల వారీగా కార్పొరేషన్లకు నిధులు కేటాయిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. సభ పూర్తయిన తర్వాత తర్వాత చంద్రబాబు పాలకొల్లులోని కల్యాణ మండపంలో రాత్రి బస చేశారు.



పాలకొల్లు సభలో ఎటు చూసినా జనమే జనం



మనసున్న నాయకుడు నిమ్మల

ప్రజలకు సేవ చేయాలన్న మంచి మనసున్న నాయకుడు పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు. ఆయనకు డబ్బు లేకున్నా రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యాడు. అయినా సంపాదించుకోలేదు. ప్రజల సమస్యలు తీర్చేందుకు ఎప్పుడూ భుజంపై సంచి వేసుకుని తిరుగుతుంటాడు. కరోనా సమయంలో ప్రాణాలు లెక్క చేయకుండా సైకిల్‌పై తిరిగి సేవ చేసిన రామానాయుడును వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ ఆవిర్భావం నుంచి కష్ట సమయాల్లోనూ పార్టీకి అండగా నిలిచిన గొప్ప నాయకుడు షరీఫ్. ఆయన సేవలను మరిచిపోనని చంద్రబాబు ప్రశంసించారు. కొవ్వలి నాయుడు అమెరికా ప్రయాణాన్ని నరసాపురం - భీమవరం ప్రయాణంగా మార్చేశాడు. పార్టీ కోసం ఈ రెండేళ్లలో అమెరికా నుంచి 30 సార్లుపైనే నరసాపురం వచ్చాడు. పొత్తులో టిక్కెట్ దక్కకపోయినా పార్టీకి కట్టుబడి నిలబడ్డాడు. అలాగే పొత్తూరి రామరాజు నిజాయితీగా పనిచేశాడు. అధికారంలోకి రాగానే వీరి సేవలను గుర్తిస్తామన్నారు.



గెలుపు మనదే

- ఏలూరు లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థులతో చంద్రబాబు ముఖాముఖి.. దిశా నిర్దేశం
- వైసీపీపై ఓ కన్నేసి ఉంచాలని హెచ్చరిక

ఏలూరు/పెదవేగి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే అభ్యర్థులకు జనాదరణ ఉంది. గెలుపు మనదే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. కాని, ఎవరి పట్ల వివక్షత చూపకుండా అందరితో మాట్లాడి దగ్గరకు తీసుకోండి. చిన్నచిన్న లోపాలను సవరించుకోండి. వైసీపీ పోకడలను ఓ కంట కనిపెట్టి ఉండండి' అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు కూటమి అభ్యర్థులకు దిశా నిర్దేశం చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి నల్లజర్లలో రాత్రి బస చేసిన చంద్రబాబును శుక్రవారం ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలోని కూటమి అభ్యర్థులు కలిశారు. ఉమ్మడిగా లక్ష్యాలను ఏ మేరకు అందుకుంటున్నారు. ఏ ఏ నియోజక వర్గాల్లో పరిస్థితి ఎలా ఉందని ఆరా తీశారు. ముఖాముఖీ భేటీ కావడమే కాక స్పష్టతతో కూడిన సంకేతాలు, సూచనలు ఇచ్చారు. ఉంగుటూరు నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించినా.. అక్కడ జనసేన అభ్యర్థికి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు నడుమ పరస్పర సహకారం, సమన్వయం బాగుందని ప్రశంసించారు. కూటమి అభ్యర్థులు ఎవరైనా, ఏ పార్టీకి చెందిన వారైనా గెలుపు ఒక్కటే లక్ష్యం కావాలని, అప్పుడే కూటమి విజయావకాశాలు నూరు శాతం సాధించాలని స్పష్టం చేశారు. నూజివీడులో పరిస్థితి అనువుగానే ఉందని అక్కడ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు సమస్య ఒక్కటేనా, ఇంకేమైనా ఉందా అని అభ్యర్థి కొలుసు పార్థసారధిని ఆరా తీశారు. గెలుపుపై ఏ మాత్రం ఢోకా లేదని, ఆయన బదులిచ్చారు. దెందులూరులోనూ ప్రభాకర్‌కు పూర్తి సానుకూలత ఉందని చెబుతూనే తాజా పరిస్థితిపై ఆయనను ఆరా తీశారు. ఎవరితో విభేదాలు వద్దు. అందరినీ కలుపుకుని వెళ్లండి, మద్దతు కూడగట్టుకోండి. గెలుపు అలవోకగా మీ సొంతం అంటూ ప్రభాకర్‌కు సూచనలు చేశారు. కైకలూరులో కూటమికి సానుకూలత ఉందని, అన్ని వర్గాలు కలిసొస్తున్నాయని, సమయస్ఫూర్తిని ప్రదర్శిస్తున్నాయని కైకలూరు అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఎంపీ అభ్యర్థి మహేష్‌కుమార్ యాదవ్‌కు వేగంగా సానుకూలత పెరుగుతోందని, ఆయన విజయం కోసం అసెంబ్లీ అభ్యర్థులంతా సృజనాత్మకంగా వ్యవహరించాలన్నారు. ఏలూరు అభ్యర్థి బడేటి చంటికి ప్రజాభిమానం అన్యూహంగా పెరుగుతూ వస్తోందని, వివిధ వర్గాలు ఆయనకు చేయూతగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. పోలవరం విషయంలో పునరాలోచనపై భేటీలో ప్రస్తావనకు వచ్చింది. దీనిపై త్వరలో డిస్కషన్ చేస్తామంటూ చంద్రబాబు ప్రకటించారు. కూటమి అభ్యర్థులు గెలుపునకు త్వరలో తాను, పవన్ రోడ్ షో చేయబోతున్నట్టు చంద్రబాబు చెప్పారు. భీమవరం నుంచి పాలకొల్లు లేదా, నరసాపురం వరకు ఉండవచ్చునన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ లావణ్యవేణి, అధికారులు

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

ఏలూరు కలెక్టరేట్, ఏప్రిల్ 5 : స్వాతంత్ర్య సమర యోధుడు, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ గొప్ప సంస్కరణ వాది అని జేసీ బి.లావణ్యవేణి అన్నారు. కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి జేడీ జయప్రకాష్ అధ్యక్షతన జరిగింది. జేసీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయన దేశానికి చేసిన సేవలు ఎన్నటికీ మరువలేమన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ విద్యనభ్యసించి ఉన్నతస్థానాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. తొలుత జేసీతో పాటు డీఆర్వో డి.పుష్పమణి, డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, డీఆర్‌డీఏ పీడీ విజయ్ రాజు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా మైనార్టీ శాఖ అధికారి ఎన్.ఎస్ కృపావరం, బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎదురుచూపులు!

- నెరవేరని సీఎం జగన్ హామీలు
- పరిహారం అందక.. నిలువ నీడ లేక పాట్లు
- పోలవరం నిర్వాసితుల ఆవేదన

కుక్కునూరు, ఏప్రిల్ 5 : పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులను సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. నిర్వాసితులు వ్యక్తిగత పునరావాస పరిహారం, ఇళ్ల పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. గత ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చాకా మీ సమస్యలు పరిష్కరిస్తానంటూ జగన్ ఇచ్చిన హామీలు ఐదేళ్లుగా పరిష్కారానికి నోచుకోలేదు. 41.15 కాంటూర్ లెవల్‌లో కుక్కునూరు మండలంలో ఎనిమిది గ్రామాలు ముంపునకు గురవుతాయని ప్రభుత్వం గుర్తించింది. భువనగిరి, గంపెన పల్లి, గొమ్ముగూడెం నిర్వాసితులకు పునరావాస వ్యక్తిగత పరిహారం చెల్లించారు. చీరవల్లిలో 400కి పైగా నిర్వాసితులు ఉండగా 200 మందికి మాత్రమే చెల్లించారు. కుక్కునూరు 'ఏ' బ్లాక్, కివ్వాక, దామరచర్ల, రామచంద్రపురం నిర్వాసితులకు పరిహారం అందలేదు. ఏళ్లు గడుస్తున్నా పరిహారం నేటికీ అందడం లేదు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లిస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారే కానీ అమలు చేయలేదు. ఇప్పటి వరకు గిరిజనేతర నిర్వాసితులకు రూ.6.36 లక్షలు, గిరిజనులకి, ఎస్సీలకి రూ.6.86 లక్షలు చొప్పున మాత్రమే ఖాతాలో జమ చేశారు. ఏటా గోదావరి వర దలకు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. కుక్కునూరులోని 'ఏ' బ్లాక్ తో పాటు 41.15 కాంటూర్‌లో లేని ఎల్లప్ప గూడెం, బెస్తగూడెం, కౌడిన్య ముక్తి, చెరువు కొమ్ము గూడెం, ఆంబోతులగూడెం తదితర గ్రామాల నిర్వాసితులు ముంపు నకు గురై సర్వం కోల్పోతున్నారు. కుక్కునూరు 'ఏ' బ్లాక్‌లో 750 కుటుంబాలు ఉండగా దాదాపు 100కి పైగా నిర్వాసితుల కుటుంబాల ఇళ్లు కూలిపోయాయి. వారంతా నిరుపేదలు కావ డంతో మళ్లీ తిరిగి ఇళ్ళు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేక కివ్వాకలో నిర్మిస్తున్న పునరావాస కాలనీలో తలదాచుకుని జీవనం సాగిస్తున్నారు. కొత్తూరు గిరిజన నిర్వాసితుల ఇళ్లు శిథిలావస్థకు చేరడంతో వారికోసం మద్రిపాడులో నిర్మించిన పునరావాస కాలనీలో ఇళ్లు కేటాయిం చాలని 60 కుటుంబాల గిరిజనులు కోరుతున్నారు. ఇటీవల సీపీఎం ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో సూర్యతేజని కలిసి తమ గోడు వినిపించారు. కుక్కునూరు-భద్రాచలం ఆర్‌అండ్‌బీ రహదారి కనీసం మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఈ రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

హామీలకే పరిమితం

గత ఎన్నికల సమయంలో పోలవరం నియోజకవర్గంలో జగన్ ప్రతిపక్ష హోదాలో పర్యటించిన పుడు పలు హామీలు ఇచ్చారు. గతంలో తన తండ్రి వైఎస్ హయాంలో ఎకరానికి



గోదావరి వరదలకు ఇళ్లు ఖాళీ చేస్తున్న నిర్వాసితులు(ఫైల్)

రూ.1.15 లక్షలు పరిహారంగా ఇచ్చారని, నాడు భూములు ఇచ్చిన రైతాంగానికి అధికారంలోకి రాగానే అదనంగా ఎకరానికి రూ.3.50 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. రెండేళ్ల క్రితం ఎన్ని ఎకరాలకు అదనపు పరిహారం ఇవ్వాలో సర్వే జరిపినా ఇంతవరకు పరిహారం అందలేదు. కేంద్రంతో సంబంధం లేకుండా ప్రతి నిర్వాసితుడికి పునరావాస వ్యక్తిగత పరిహారం రూ.10 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. 41.15 కాంటూర్ లెవల్‌లో ఉన్న గ్రామాల్లో నిర్వాసితులకు వ్యక్తిగత పరిహారం, కోల్పోతున్న ఇంటికి పరిహారం ఇచ్చి, పునరావాస కాలనీకి తరలిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు కేంద్రం నిధులు ఇస్తేనే పరిహారం చెల్లిస్తామని అంతా దేవుని దయ అంటూ సీఎం జగన్ చెబుతున్నారు. దీంతో నిర్వాసితుల ఆశలు అడియాశలైయ్యాయి.

583 'సువిధ' అభ్యర్థనలకు అనుమతులు : కలెక్టర్

ఏలూరు సిటీ, ఏప్రిల్ 5 : జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ / ఎన్‌కోర్ ద్వారా అందిన అభ్యర్థనల్లో ఇంతవరకు 583 అభ్యర్థనలకు అనుమతులు ఇచ్చినట్టు శుక్రవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. 'జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే కలెక్టరేట్‌లో జిల్లా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాం. వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. ఎన్నికల ప్రచార అనుమతులు కోసం సువిధ ద్వారా గురువారం రాత్రి వరకు 862 అభ్యర్థనలు రాగా 583 అనుమతులు జారీ చేయగా, మరో 8 పరిశీలనలో ఉన్నాయి. సరైన రీతిలో దరఖాస్తు చేయని 271 తిరస్కరించబడ్డాయి. సి-విజిల్ ద్వారా 259 ఫిర్యాదులు అందగా వాటిలో 162 ఫిర్యాదులను పరిష్కరించాం. మరో 97 ఎన్నికలకు సంబంధం లేని ఫిర్యాదులు తిరస్కరించబడ్డాయి. మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలపై వచ్చిన 79 ఫిర్యాదులను పరిష్కరించాం. ఎన్నికలకు సంబంధించి అంశాలపై చర్యల కోసం వాట్సాప్ మెస్సేజ్/ ఫోటోల ద్వారా వాస్తవ సమాచారం ప్రజలకు అధికార యంత్రాగానికి అందించడానికి వాట్సాప్ నెంబర్ 94910 41435 అందుబాటులో ఉంచాం. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలి. ఫిర్యాదుల నమోదు కోసం కలెక్టరేట్ కాల్ సెంటర్ నెంబర్ 1800 233 1077 ఏర్పాటు చేశాం.' అన్నారు.



స్వర్ణాంధ్ర కాలేజీ నుంచి చంద్రబాబు రోడ్‌షో

చంద్రబాబుకు ఘన స్వాగతం

నరసాపురం, ఏప్రిల్ 5 :నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజీలోని హెలీప్యాడ్ వద్ద చంద్రబాబుకు ఘనస్వాగతం లభించింది. టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, మండలి మాజీ చైర్మన్ షరీఫ్, మాజీ మంత్రులు పితాని సత్యనారాయణ, కొత్తపల్లి సుబ్బా రాయుడు, మాజీ ఎమ్మెల్యేలు బండారు మాధవ నాయుడు, ఆరిమిల్లి రాధాకృష్ణ, ఇన్‌చార్జ్‌లు పొత్తూరి రామరాజు, వలవల బాబ్జి, కొవ్వలి నాయుడు స్వాగతం పలికారు.అనంతరం మొగల్తూరు రోడ్, రుస్తుంబాద, పంజా సెంటర్, వైఎన్ కాలేజీ మీదుగా స్టీమర్ రోడ్‌కు చేరుకున్నారు.



బాబుకు వినతుల వెల్లువ

- భవన నిర్మాణ మెటీరియల్ ధరలు పెరగడంతో నిర్మాణ రంగం పతనమైంది. ఇసుక, స్టీల్, సిమెంట్ ధరలు పెరగడంతో నిర్మాణాలు లేవు. మా బతుకులు నాశనం అయ్యాయని భవన నిర్మాణ కార్మికులు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు.
- పీజీ విద్యార్థులుకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు విద్యాదీవెన పెంచాలి. ఉద్యోగ నియామకాలు చేపట్టాలని స్వర్ణాంధ్ర విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శించి వినతిపత్రం ఇచ్చారు.
- కేంద్ర ప్రభుత్వం త్వరలో అమలు చేసే ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్ చట్టం వల్ల ముస్లిం మైనార్టీలకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని ముస్లీం పెద్దలు మౌలాలీ, బడేవలి, ఖాజా, ఆయుద్‌ఖాన్ తదితరులు చంద్రబాబును కోరారు.
- సంక్షోభంలో కూరుకుపోయిన ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని కోరిపల్లి వాసు, ఒడుగు ఏసు, వాతాడి ఉమా చంద్రబాబుకు వినతిపత్రం అందించారు.

పోలీసుల అత్యుత్సాహం

పాలకొల్లు, ఏప్రిల్ 5 : పాలకొల్లు పట్టణంలోకి వచ్చే వాహనాలను వివిధ మార్గాలలో దారి మళ్లించారు. పట్టణ సీఐ మంగాదేవి, రూరల్ సీఐ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. నరసాపురం నుంచి వచ్చేవాటిని నరసాపురం బైపాస్ రోడ్డు వద్ద, భీమవరం నుంచి వచ్చే వాహనాలను లాకుల వద్ద, మార్టేరు వైపు నుంచి వచ్చే వాహనాలను బ్రాడీపేట బైపాస్ వద్ద, దొడ్డిపట్ల, ఆచంటల నుంచి వచ్చే వాహనాలను యడ్ల బజారు వద్ద నిలిపి వేయడంతో చాలామంది నడుచుకుంటూ రావలిసి వచ్చింది.పలువురు ద్విచక్ర వాహనాలపైనే సభాస్థలి వద్దకు చేరుకున్నారు. పెద్దఎత్తున మహిళలు వచ్చారు.

వ్యవసాయ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక



ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 5 : ఏపీ వ్యవసాయ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లాశాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం ఏలూరులోని వ్యవ స్యాయ శాఖ జేడీ కార్యాలయంలో జరిగాయి. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ వివరాలను ఏపీ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ సీహెచ్.శ్రీనివాస్ పత్రికలకు విడుదల చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడిగా వీఎస్ఆర్ గంగాధర్, కార్యదర్శిగా ఎండీ రఫీ, కోశాధికారిగా బి.రాకేష్, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారని వివరించారు. వ్యవస్యాయ శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి, వారి శ్రేయస్సుకు నూతన కార్యవర్గం పని చేయాలని సూచించారు. వ్యవస్యాయశాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్, కార్యదర్శి ప్రసాద్, ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన డీఎస్ఎన్ శ్రీనివాస్, జేఏసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నెరుసు రామారావు తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి వ్యవసాయశాఖ ఏలూరు జిల్లా అధికారి షేక్ హబీబ్ భాషా పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేశారు.



ఉగాది బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

66 మందికి ఉగాది పురస్కారాలు

9న భీమేశ్వరస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు

భీమవరంటౌన్, ఏప్రిల్ 9 : భీమవరం భీమేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 9న శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నామని 66 మందికి ఉగాది పురస్కారాలను అందిస్తున్నామని కార్యక్రమ నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి తెలిపారు. తెలుగువారి సంప్రదాయాలను, పండుగల ప్రాముఖ్యతను భావితరాలకు తెలియజేసేలా ఉగాది వేడుకలను 39 ఏళ్లుగా నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 9వ తేదీ ఉదయం 9-30 గంటల నుంచి భీమేశ్వరస్వామి ఆలయంలో ఉగాది వేడుకలను నిర్వహిస్తున్నామని, కవి, పండిత, కళాకారులకు సత్కారాలు నిర్వహిస్తున్నామన్నారు. పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. వడుపు గోపి, కంతేటి వెంకటరాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉత్తమ ఉద్యోగులకు, స్వచ్ఛంధ సంస్థల, సంఘ సేవలకు సుమారు 66 మందికి ఉగాది పురస్కారాలను అందిస్తున్నామని తెలిపారు. శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు, కలెక్టర్, ఎస్పీ తదితర ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు.



5-04-2024 పొగాకు ధరలు (రూ.) పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	242	226	235.47
జంగారెడ్డిగూడెం-1	242	235	239.92
జంగారెడ్డిగూడెం-2	242	235	239.90
కొయ్యలగూడెం	242	235	240.01
గోపాలపురం	242	235	240.18



భగ్గుమన్న భానుడు



నిర్మానుష్యంగా మారిన భీమవరం ప్రకాశం చౌక్

ఏలూరులో 44 , భీమవరంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు

ఉక్కపోత తట్టుకోలేక అల్లాడిన ప్రజలు

వాతావరణం మార్పుతో ఉక్కిరిబిక్కిరి

భానుడు ఉగ్రరూపం చూపించాడు. శుక్రవారం పలు ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ భగ్గుమంది. ఉక్కపోత తట్టుకోలేక ప్రజలు విలవిల్లాడిపోయారు. ఈ సీజన్‌లోనే అత్యధిక ఉష్ణోగ్రతలు శుక్రవారం నమోదయ్యాయి. ఏలూరులో పగటి ఉష్ణోగ్రత 44 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదవగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో 42 డిగ్రీలు నమోదైంది.

ఏలూరుసిటీ/ భీమవరం టౌన్ ఏప్రిల్ 5: ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెం, భీమడోలు, నూజివీడు, ద్వారకా తిరుమల, చింతలపూడి, కైకలూరు తదితర ప్రాంతాల్లో భారీగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నాలుగు రోజులుగా ఎండల తీవ్రత విపరీతంగా పెరిగింది. 40 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. శుక్రవారం ప్రధాన రహదారులపై జన సంచారం పూర్తిగా తగ్గింది. మధ్యాహ్నం 12 గంటల కల్లా ఏలూరులోని ప్రధాన కూడళ్లలో జనసంచారం తగ్గిపోయింది. మధ్యాహ్నం 2 గంటలకు ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా తయారయ్యాయి.ద్విచక్రవాహనాలపై ప్రయాణం కష్టతరంగా మారింది. ఎండ తీవ్రతను తట్టుకోలేక ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఎండల తీవ్రత మరికొన్ని రోజుల పాటు ఉంటుందని, వేడిగాలులు ప్రభావం కూడా ఈ నెలలో ఎక్కువగా ఉంటుందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈసారి ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంటుందని, గతలో ఎన్నడూ లేని విధంగా భారీగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని వాతావరణ శాఖ చెబుతోంది.

భీమవరంలో అల్లాడిన జనం

భీమవరంలో శుక్రవారం 42 డిగ్రీలకు ఉష్ణోగ్రత పెరగడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వారం రోజులుగా 37-38 మధ్య ఉష్ణోగ్రతలు ఉన్నాయి.. మధ్యాహ్నం 1 గంట నుంచి రోడ్లులో జనసంచారం తగ్గడంతో నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఈ వాతావరణం మరో నాలుగైదు రోజులు కొనసాగుతుందని చెప్పడంతో అందుకు అనుగుణంగా ఉష్ణోగ్రత ఇబ్బందుల నుంచి బయట పడాల్సిన అవసరం ఉంది. ఆరోగ్య జాగ్రత్తలు కూడా తీసుకోవాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. మరోవైపు ఎన్నికల ప్రచారంలో ఎండ దెబ్బకు రాజకీయ పక్షాలవారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. సమావేశాలకు వచ్చే ప్రజలు కూడా బాబోయ్ ఇవేం ఎండలంటూ ఆందోళన చెందుతున్నారు.. ఎండ తీవ్రత పెరగటంతో జిల్లా చలివేంద్రాలు ఏర్పాటు చేయించాలని ఇటీవల కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వివాహాది శుభాకార్యాలు కూడా ఎక్కువగా ఉండటంతో వచ్చినవారంతా ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు.



ఏలూరులో డ్రింక్‌లతో ఎండ నుంచి ఉపశమనం





ఎండ తట్టుకోలేక భీమవరంలో రోడ్డుపై ఉన్న గోతిలోని నీటిలో సేద తీరుతున్న గేదె

ఏలూరులో ఎండదెబ్బకు ఇలా.. →



ముసుగు తొలగించారు

వలంటీర్లపై వైసీపీ నాయకుల ఒత్తిళ్లు

వివిధ చోట్ల పలువురు రాజీనామాలు

అత్తిలి, ఏప్రిల్ 5 : వైసీపీ నాయకులు తెర తొలగిస్తున్నారు. పార్టీ కార్యకర్తలనే వలంటీర్లుగా నియమించుకున్నారు. ఇప్పటివరకు సేవ అనే ముసుగులో ప్రభుత్వ సొమ్మును ఇచ్చి పోషించిన వలంటీర్లను ఎన్నికల సంఘం పక్కన పెట్టడంతో అధికార పార్టీకి దిక్కు తోచడం లేదు. ఒత్తిడి చేసి కొన్నిచోట్ల వలంటీర్లను రాజీనామాలు చేస్తున్నారు. ఎన్నికల వేళ వారిని ఉపయోగించుకునేదుకు వీలుగా స్కెచ్‌లు వేస్తున్నారు. కొంతమంది పరోక్షంగా సహకరిస్తామని రాజీనామాలు చేయబోమని చెబుతున్నారు. అయినా వారిపై ఒత్తిడి తెచ్చి బలవంతంగా విధులకు దూరం చేస్తున్నారు. గౌరవ వేతనం మీదనే ఆధారపడిన వారు ఉద్యోగం మానేస్తే ఉపాధి దెబ్బతింటుందని వెనకడుగు వేస్తున్నారు. అలాంటి వారికి నేతలే ఆర్థికంగా భరోసా ఇస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం రెండు నెలల పాటు తామే ఇస్తామంటూ రంగంలోకి దింపుతున్నారు. ప్రభుత్వం వస్తే మిమ్మలనే నియమిస్తామని ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.



ఉండి మండలం యండగండిలో రాజీనామా లేఖను గ్రామ కార్యదర్శి పవన్‌కుమార్‌కు అందిస్తున్న వలంటీర్లు



ఆకివీడు ఎంపీడీవో కార్యాలయంలో రాజీనామా పత్రాలు ఇచ్చిన వలంటీర్లు

57 మంది వలంటీర్ల రాజీనామా

ఆకివీడు/ అత్తిలి /ఉండి, ఏప్రిల్ 5: ఆకివీడు నగర పంచాయతీ పరిధిలో పంతొమ్మిది మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. ఆకివీడు-3 సచివాలయానికి చెందిన వలంటీర్లు రాజీనామా చేశారని వీటిని ఉన్నతాధికారులకు పంపించనున్నట్టు ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు. అత్తిలి మండలానికి చెందిన లక్ష్మీనారాయణపురం, స్కిన్నెరపురం, పాలూరు గ్రామాలకు చెందిన 28 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శులకు అందజేశారు. ఉండి మండలం యండగండిలో పది మంది వలంటీర్లు రాజీనామాలు చేశారని గ్రామ కార్యదర్శి పవన్‌కుమార్ తెలిపారు.

భీమవరం ఆసుపత్రిలో 'స్వచ్ఛ తల్లిపాల బ్యాంకు'

ఏర్పాటుకు గదులను పరిశీలించిన జేసీ ప్రవీణ్ ఆదిత్య



వైద్యాధికారులతో మాట్లాడుతున్న జేసీ

భీమవరం క్రైం, ఏప్రిల్ 5 : కొంత మంది నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు, తల్లి పాలు సమృద్ధిగా లేని పిల్లలకు పాలు అందించేందుకు స్వచ్ఛ తల్లిపాలు బ్యాంకు ద్వారా మంచి అవకాశం కలుగుతుందన్నారు. కొంత మంది దాతలు తల్లుల నుంచి పాలను సేకరించి స్వచ్ఛ తల్లిపాలు నిధిలో భద్రపరిచి, అవసరం అయిన పుట్టిన బిడ్డలకు అందించి శిశు మరణాలను జీరో శాతం చేయడమే లక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కాకినాడ ఏరియా హాస్పిటల్‌లో మాత్రమే ఇటువంటిది ఉందని, రెండవది భీమవరం ఏరియా హాస్పిటల్‌లో త్వరలో ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవాలని డీసీహెచ్, సూపరిండెంట్‌లను జేసీ ఆదేశించారు. డీసీహెచ్ఎస్ సూర్యనారాయణ, హాస్పిటల్ సూపరింటెండెంట్ మాధవీ కళ్యాణి, వైద్యాధికారులు ఉన్నారు.

చదరంగం విజేతలకు బహుమతులు



విజేతలతో భీమవరం సీఐలు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 5: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరం, అనసూయ అకాడమీలో అండర్-17 ఓపెన్ బాలికల చెస్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. విజేతలకు భీమవరం వన్, టూ టౌన్ సీఐలు శ్రీనివాస్,అడబాల శ్రీను హాజరై బహుమతులు అందించారు. విజేతలు, ఏప్రిల్ 20, 21 తేదీలలో గుడివాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. చెస్ అసోసియేషన్ సభ్యులు అల్లు శ్రీనివాస్, మైలాపురి మురళి, రవి పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తిరుమలరావు

ఏకాగ్రతతో కూడిన అభ్యాసం అవసరం

భీమవరం టౌన్‌ఏప్రిల్ 5 :భీమవరం ప్రకృతి ఆశ్రమం వద్ద గల తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో ఐఐటీ, నీట్ ఫౌండేషన్‌పై జరిగిన అవగాహన సదస్సుకు అనూహ్య స్పందన లభించిందని విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు తెలిపారు. సుమారు 8 వేల మంది హాజరైనట్లు తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లలు విజయం సాధించాలంటే ఏకాగ్రతతో కూడిన అభ్యాసం, వ్యక్తిత్వ వికాసం ఎంతో అవసరమన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థుల ప్రగతికి సోషల్ మీడియా అవరోధంగా మారిందని మొబైల్ వినియోగించే విషయంలో తల్లిదండ్రులు పిల్లల పట్ల కొంచెం కఠినంగా ఉండాలన్నారు. తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ జి.సతీష్ బాబు, రెసిడెంట్ డైరెక్టర్స్ సాయిరాజు, పి.శ్రీనివాస వర్మ తదితరులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో విర్డ్ ఆసుపత్రిలో హ్యాండ్ సర్జన్ వైద్యసేవలు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 5: ద్వారకా తిరుమల విర్డ్ ట్రస్ట్ ఆసుపత్రిలో ఈనెల 11, 12 తేదీల్లో ప్రముఖ హ్యాండ్ సర్జన్ డాక్టర్ భాస్కర్ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు తెలిపారు. పుట్టుకతో వచ్చిన చేతి సమస్యలు, పోలియో, అన్ని రకాల చేతి సమస్యలు ఉన్నవారు ఆసుపత్రిలో సంప్రదించాలని కోరారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో నిర్దేశించిన వైద్యసేవలను ఉచితంగా అందిస్తామన్నారు. వైద్యసేవలు అవసరమైనవారు ముందుగా 85002 63149 నంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

క్రైం కార్నర్

మహిళపై లైంగిక వేధింపులు..కేసు నమోదు

టి.నరసాపురం, ఏప్రిల్ 5 : మహిళను లైంగిక వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు. తిరుమలదేవిపేట పంచాయతీలోని వెంకటాపురం గ్రామానికి చెందిన దళిత మహిళపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి గత కొంత కాలంగా ఆమె వెంటపడుతూ వేధిస్తున్నట్లు మహిళ ఫిర్యాదుతో అతనిపై లైంగిక వేధింపులు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విశాఖ డెయిరీ సొమ్ము వాడుకున్న వ్యక్తిపై కేసు నమోదు

భీమవరం క్రైం, ఏప్రిల్ 5 : విశాఖ డెయిరీకి సంబంధించిన సొమ్మును సొంతానికి వాడుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు శుక్రవారం చెప్పారు. భీమవరం నరస్య అగ్రహారం ప్రాంతానికి చెందిన కర్రి మాధవ్ విశాఖ డెయిరీలో కలెక్షన్ ఏజెంటుగా చేస్తున్నాడు.కలెక్షన్ చేసిన సొమ్ములో సుమారు రూ.42.76 లక్షలు సొంతానికి వాడుకోవడంతో మేనేజర్ రొంగల వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 5 : ఒక గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం అందడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు - జంగారెడ్డిగూడెం రోడ్డులోని జేఎంజే స్కూలు సమీపంలో రోడ్డుపక్కన సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయసు కల్గిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మతి స్థిమితం లేదని మూడు రోజుల నుంచి రాళ్ళతో కొట్టుకుంటున్నాడని స్థానికులు చెప్పారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినటు రూరల్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 5 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఒక వృద్ధుడు మృతి చెందాడు. బాపులపాడు మండలం మడిచర్ల గ్రామానికి చెందిన గరిముక్కు ఏసుపాదం టీవీఎస్ మోపెడ్‌పై అదే గ్రామానికి చెందిన సాయిల వెంకటరత్నం (69)ని ఎక్కించుకుని ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం ఏలూరు సమీపంలోని వట్లూరులో ఉన్న హౌసింగ్ బోర్డుకాలనీకి వెళ్తున్నారు. మార్గ మధ్యలో సీఆర్ఆర్ మహిళా కాలేజీ ఎదురుగా మరో మోటారు సైకిల్ అతి వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలవగా ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. వెంకటరత్నం గురువారం మృతి చెందాడు. గరికముక్కు ఏసుపాదం ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఏలూరు త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తా



జీలుగుమిల్లి, ఏప్రిల్ 5 : ములగ లంపల్లి గుడి సమీపంలో జంగా రెడ్డిగూ డెంకు చెందిన ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తా పడింది. శుక్రవారం సాయంత్రం విద్యార్థుల్ని పాఠశాల నుంచి తిరిగి ఇంటికి తీసుకు వస్తుండగా గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. బస్సులో 15 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు కట్‌లు వదిలివేయడంతో ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 5: కరెంటు స్తంభాన్ని వేగంగా ఢీకొన్న ఘటనలో తీవ్రగాయాలపాలైన యువకుడు సైతం చికిత్సపొందుతూ మృతి చెందాడు. మండలంలోని కొమ్మర వద్ద గతనెల 30న జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో డొక్కా సాయికృష్ణ (19) విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోజే మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన కలకొండ సంతోష్ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన సాయికృష్ణ, సంతోష్‌లు తాపీ పనిచేస్తూ డబ్బులకోసం రాళ్లకుంట గ్రామానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రాత్రి స్వగ్రామానికి చేరుకునే సమయంలో వారి బైక్‌కు కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని వేగంగా ఢీకొట్టారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కొత్తూరు చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

వాహనాలను తనిఖీ చేసిన కలెక్టర్

కామవరపుకోట, ఏప్రిల్ 5. కామవరపుకోట పంచాయతీ పరిధిలోని కొత్తూరు ఎన్నికల చెక్ పోస్టు వద్ద శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వాహనాలను తనిఖీలు చేశారు. విజయవాడ నుంచి దేవులపల్లి గ్రామం వెళుతున్న ఒక వ్యక్తి నుంచి రూ.76,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ రమేష్, డీటీ మొహిద్దీన్, స్క్వాడ్ అధికారి సత్యవాణి, ఏఎస్ఐ వీరాస్వామి, తదితరులు ఉన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఎస్ఈబీ దాడులు



ఏలూరు క్రైం, ఏప్రిల్ 5 :ఎస్పీ మేరీప్రశాంతి, అదనపు ఎస్పీ సూర్య చంద్రరావు ఆదేశాలతో ఎస్ఈబీ డీఎస్పీ జనార్ధన్‌నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో దాడులు నిర్వహించారు. కుక్కునూరు ప్రాంతంలో దాడులు నిర్వ హించి 5,100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. తెల్లవారు గూడెంలో 1700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి 12 లీటర్ల సారా, కొండపల్లిలో 1800 లీటర్ల బెల్లపుఊట, 8లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ప్రాం తాల్లో 1600 లీటర్ల బెల్లపుఊట, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా జరిగిన దాడుల్లో 8 కేసులు నమోదుచేసి, 190 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 6500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్, ఎస్ఐ మురళీధర్, టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 207 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ 68 వేల 140 రూపాయలు అని తెలి పారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు తనిఖీల్లో రెండు లక్షల 17,500 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఆరు బీరు బాటిళ్ల పట్టివేత

జీలుగుమిల్లి, ఏప్రిల్ 5 : అక్రమంగా తరలించే తెలంగాణ మద్యంను రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. కాకినాడ జిల్లా తుని మండలం రేఖవానిపాలెంకు చెందిన తాలల దుర్గాశివ తన కారులో ఆరు బీరు బాటిళ్లు (బడ్‌వైజర్) అశ్వారావుపేట నుంచి తీసుకువస్తుండగా పోలీసులు తనిఖీల్లో పట్టుబడ్డాడు. మద్యం, స్వాధీనం చేసుకుని కారు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ చెప్పారు.

70 లీటర్ల సారా స్వాధీనం

కుక్కునూరు, ఏప్రిల్ 5 : మండలంలోని వేలేరు గ్రామ శివారున అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై కుక్కునూరు పోలీసు దాడి చేసారు. ఈ దాడిలో 70 లీటర్ల సారా స్వాధీన పరుచుకున్నారు. ఐదు వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసారు. ఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



శృంగవరప్పాడులో సమావేశం అడ్డుకుంటున్న పోలీసులు

నచ్చినవారికే ఓటేస్తాం..

వైసీపీకి ఓటు వేయాలని సర్పంచ్ భర్త ఒత్తిడి

శృంగవరప్పాడు గ్రామ సమావేశాన్ని అడ్డుకున్న పోలీసులు

కైకలూరు, ఏప్రిల్ 5: కొల్లేరు గ్రామాల కట్టుబాట్ల మధ్య ఒక పార్టీకే మద్దతు తెలపాలని కొంతమంది నాయకులు చేస్తున్న ప్రయత్నాలకు పోలీసులు సైతం పరోక్షంగా మద్దతు తెలపడం విమర్శలకు తావిస్తోంది. గురువారం రాత్రి కైకలూరు మండలం శృంగవరప్పాడులో గ్రామ సమావేశాన్ని నిర్వహించారు. గతంలో వైఎస్సార్ సంపూర్ణ గ్రామాలుగా ప్రకటించి ప్రజలు మద్దతు ఇచ్చారు. అయితే ఆశించిన మేర గ్రామ అభివృద్ధి జరగలేదని, సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛగా తమకు నచ్చిన వారికి ఓటు వేసుకుంటామని సమావేశంలో పలువురు పేర్కొన్నారు. దీంతో సర్పంచ్ ఘంటసాల భాగ్యలక్ష్మి భర్త జగన్నాథం దానికి ఒప్పుకోమని వైఎస్సార్ సంపూర్ణ గ్రామాలుగానే ఉండాలని పట్టుబట్టారు. గ్రామ కట్టుబాట్ల మధ్య తీసుకునే నిర్ణయాలకు వ్యతిరేకంగా ఒక వర్గం పట్టుబట్టి అధికార పక్షానికి పట్టం కట్టాలని ప్రయత్నించడాన్ని తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. సమాచారం తెలుసుకున్న కైకలూరు రూరల్ పోలీసులు రంగప్రవేశం చేసి సమావేశాన్ని మధ్యలోనే నిలిపివేశారు. అనుమతుల్లేకుండా సమావేశాలు నిర్వహించవద్దంటూ అడ్డుకున్నారు. దీంతో గ్రామస్థులు ఒక వర్గం చెప్పిన విధంగా ఓట్లు వేయాలనడం తగదని ఎన్నికల సమావేశం కాదని గ్రామ సమావేశం మాత్రమే నిర్వహిస్తున్నామని పోలీసులు అడ్డుకోవడం సబబు కాదని పదేపదే వారించారు. గ్రామాన్ని వైఎస్సార్ సంపూర్ణ గ్రామంగా తీసేసి ఎవరికి నచ్చినవిధంగా వారికి ఓటు వేసుకునే విధంగా ఉండాలన్నారు. పోలీసులు సమావేశం జరిగేందుకు ఒప్పు కోకపోవడంతో వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగానే పోలీసులను పంపించారని పోలీసులు సైతం అధికార పక్షానికి మొగ్గుచూపుతూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.దీంతో గ్రామస్థులు పోలీసులపై తోపులాటకు దిగారు. సమావేశం అర్ధంతరంగా ముగిసింది. తాము స్వేచ్ఛగా ఓటేసేలా ఎన్నికల కమిషన్ చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవం


చెన్నకేశవస్వామి కల్యాణంలో వేద పండితులు

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 5: శనివారపు పేటలోని శ్రీదేవి భూదేవి సమేత చెన్న కేశవస్వామి దేవాలయ కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన అర్చకులు, ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం వేద పండితులు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం జరిపారు. అర్ధరాత్రి వరకు కల్యాణం జరగ్గా అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

గుబ్బల మంగమ్మకు కలెక్టర్ దంపతుల పూజలు


అమ్మవారి సన్నిధిలో కలెక్టర్ దంపతులు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 4 : మన్యం బిడ్డల ఆరాధ్య దైవం గుబ్బల మంగమ్మ తల్లిని జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మ వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబంతో సహా అమ్మ వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఏలూరు 'ఇండియా కూటమి అభ్యర్థి'గా వెంకటేశ్వరరావు



ఏలూరు రూరల్, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు నియోజకవర్గంలో ఇండియా కూటమి అభ్యర్థిగా సీపీఐ నేత బండి వెంకటేశ్వరరావు పోటీ చేస్తున్నారు. ఆయన నిడమర్రు మండలం భువనపల్లిలో 1967లో ఓ సామాన్య కుటుంబంలో జన్మించారు. ప్రాథమిక విద్య తణుకు రూరల్ మండలం మండపాకలో ఏడో తరగతి వరకు, హైస్కూల్ విద్య తణుకు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివారు. ఇంటర్, డిగ్రీ తణుకులో చదివి లావిద్య ఏలూరు సీఆర్ఆర్ కళాశాలలో పట్టా పొం దారు. ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శిగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అనేక విద్యార్థి సమస్యలపై పోరాటం చేశారు. సీపీఐ ఉద్యమ అవసరాల రీత్యా 1993లో తణుకు నుంచి ఏలూరు వచ్చారు. ఓవైపు పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పనిచేస్తూ మరోపక్క 1986 నుంచి 2007 వరకు జర్నలిస్ట్‌గా పనిచేశారు. ప్రస్తుతం సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శిగా, జిల్లా కార్యవర్గ సభ్యులుగా, వ్యవసాయ కార్మికసంఘం జాతీయ సమితి సభ్యుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, జిల్లా అధ్యక్షుడిగా, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా తదితర బాధ్యతలు నిర్వర్తించారు.

పురందేశ్వరిని కలసిన భీమడోలు బీజేపీ నాయకులు


పురందేశ్వరితో బీజేపీ నాయకులు

భీమడోలు, ఏప్రిల్ 5 : ద్వారకా తిరుమల దైవదర్శనానికి వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరిని భీమడోలు మండలంలోని పలువురు బీజేపీ నాయకులు, వికలాంగ హక్కుల పోరాట సమితి సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. పోలసానపల్లి రహదారిపై బీజేపీ నాయ కులు వెజ్జు ధర్మారావుతో పాటు వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు నాగభూషణం, బెంజిమన్, లీలాకృష్ణ, యడ్లపల్లి నాగేశ్వరరావు తదితరులు కలిశారు.

బీఈడీ కాలేజ్ ప్రిన్సిపాల్ అగస్టీన్ మృతి


అగస్టీన్ (ఫైల్)

ఏలూరు రూరల్, ఏప్రిల్ 5: ఏలూరు తంగెళ్లమూడి సెయింట్ ఆన్స్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ అగస్టీన్(50) శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆంధ్రా యూనివర్సిటీ పూర్వవిద్యార్థిగా, విద్యావేత్తగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎంఎఫ్ మాజీ నాయకుడిగా, కొన్నేళ్ళుగా ఏలూరు బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం అనారోగ్యంతో విజయవాడ ఆసుపత్రిలో చేరి శుక్రవారం ఉదయం మృతిచెందారు. ఆయన మృతికి ఏలూరు తెలుగుదేశంపార్టీ అభ్యర్థి బడేటి చంటి, పలువురు పాస్టర్లు సంతాపం తెలిపారు.

నామమాత్రంగా మండల పరిషత్ సమావేశం

బుట్టాయగూడెం, ఏప్రిల్ 4 : బుట్టాయగూడెం మండల పరిషత్ సమావేశాన్ని నామమాత్రంగా నిర్వహించి అధికారులు సమావేశం జరిగిందనిపించారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. శుక్రవారం ఎంపీపీ కారం శాంతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ప్రజాసమస్యల ప్రాస్తవనే లేదు. ఎన్నికల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు వచ్చామా వెళ్ళామా అన్నట్లుగా వ్యవహరించారు సమస్యలపై గళం విప్పినవారే లేరు. మూడు నెలలకు ఒకసారి జరగాల్సిన సమావేశం సమయం దాటిపోవడంతో హడావుడిగా నిర్వహించి ముగించారనే విమర్శలు ఉన్నాయి. ఎంపీడీవో ప్రవీన్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 5 : ఏలూరు ఆయుష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈనెల 7న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు నగరంలోని తూర్పువీధి చాటపర్రు రోడ్డులోని గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజుబాబు దేవస్థానం ఆవరణలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. గుండె, ఎముకలు, కీళ్ళు, జీర్ణకోశ వ్యాధుల నిపుణులు బొప్పన దశరథ్, సాయికృష్ణ, వెంకట జయదీప్ ఉచితంగా బీపీ, సుగర్, ఈసీజీ, బీఎండీ, తదితర వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు ఇస్తారని వివరించారు. వివరాలకు క్యాంపు కన్వీనర్ యడ్లపాటి రాముడు 88860 95777, 98480 55977 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ


పూజలు చేస్తున్న తపనా చౌదరి

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 5: శనివారపుపేట గాలిగోపురం వద్ద వున్న సీతారామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈనెల 3వ తేదీ నుంచి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సీతారామలక్ష్మణ హనుమాన్‌స్వామి విగ్రహాల ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు తపనా చౌదరి విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధనను నిర్వహించారు.

టెక్నికల్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

పెదపాడు, ఏప్రిల్ 5 : సర్‌సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 13న నిర్వహించే యునైట్ 2కె24 పేరుతో నిర్వహించే టెక్నికల్ ఫెస్టివల్‌కు సంబంధించి పోస్టరును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు కె.వెంకటేశ్వరరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఫెస్టివల్ నిర్వహిస్తామని తెలిపారు. పలు విభాగాల హెచ్‌వోడీలతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు.

బొర్రంపాలెంలో పోలీసుల కవాతు

టి.నరసాపురం, ఏప్రిల్ 5 : ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరు పాటించాలని జీలుగుమిల్లి సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ దుర్గామహేశ్వరరావు అన్నారు. మండలంలోని తిరుమలదేవీపేట, సింగరాయపాలెం, బొర్రంపాలెం గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక పోలీసు బృందాలతో కవాతు నిర్వహించారు. ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని వారు తెలిపారు.

'సహజ పానీయాలే ఆరోగ్యానికి శ్రేయస్కరం'

టి.నరసాపురం, ఏప్రిల్ 5 :సహజ పానీయాలే ఆరోగ్యానికి శ్రేయస్కరమని బంజారా బజరంగీ భేరీ, భూక్యా గోపయ్య సక్రమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు భూక్యా వేణుగోపాల్ నాయక్ అన్నారు. టి.నరసాపురం పంచాయతీలో కృష్ణాపురం గ్రామం పంచముఖ ఆంజనేయస్వామి సెంటర్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రాలు దోహదపడతాయన్నారు. జరబల పూర్ణయ్య, దేశావత్ వెంకట్, భూక్యా గాంధీ, సవరం రామదాసు, భూక్యా శ్రీనివాస్, భూక్యా సురేష్, ధరావత్ బంగారు బాబు, భూక్యా సత్యం, భూక్యా బిగనాదం, హసావత్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


దాక్టర్ జగ్జీవన్‌రామ్ చిత్రపటాల వద్ద ఏలూరు టెన్త్ స్పాట్ కేంద్రంలో డీఈవో తదితరులు, ఏలూరులో జిల్లా అదనపు ఎస్పీ స్వరూపరాణి, సీతారామనగరంలో దళిత సంఘాల నాయకులు, గోపీనాథపట్నంలో ఎంపీపీ శ్రీలక్ష్మి తదితరుల నివాళి

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

వాడవాడలా విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళులు

స్వాతంత్ర్య సమరయోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి సేవలను కొనియాడారు.

- ఏలూరు రూరల్, ఏప్రిల్ 5: టీడీపీ ఏలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి బడేటి బుజ్జి క్యాంపు కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద బడేటి బుజ్జి తదితరులు నివాళులర్పించారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలాజీ, మాజీ ఎంపీపీ లంకపల్లి మాణిక్యాలరావు, కొత్తాడ రమణ, బి.కుటుంబరావు, దళిత నాయకులు పాల్గొన్నారు. ఏలూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఓవర్‌బ్రిడ్జి సమీపంలో వున్న విగ్రహానికి నగరపాలక సంస్థ కమిషనర్ నివాళులర్పించారు. స్థానిక జడ్పీ కార్యాలయంలోని విగ్రహానికి బీటీఏ ఆధ్వర్యంలో, ఓవర్‌బ్రిడ్జి వద్ద వున్న విగ్రహానికి బహుజన్ సమాజ్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి నేతల రమేష్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఏలూరు జిల్లా క్రిష్టియన్ సెల్ అధ్యక్షుడు జెంజు మోజెష్, ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి తదితరులు నివాళులర్పించారు. దళితసేన ఆధ్వర్యంలో రెండో డివిజన్‌లో వున్న విగ్రహానికి దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జుజ్జువరపు రవిప్రకాష్, యూత్ కమిటీ కన్వీనర్ విజయ్‌ప్రకాష్ తదితరులు నివాళులర్పించారు.
- ఏలూరు క్రైం : భారతీయ వ్యవసాయాన్ని ఆధునీకీకరించడంలో బాబుజగ్జీవన్‌రామ్ కృషి ఎనలేనిదని జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి కొనియాడారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జగజ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, ఏఆర్ డీఎస్పీ విజి శ్రీహరిరావు, ఎస్సీఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్‌జే రామాంజినాయక్, ఆర్ఐ పవన్‌కుమార్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.
- ఏలూరు ఎడ్యుకేషన్ : సమాజంలో అందరికీ సమాన అవకాశాలు లభించడానికి జగ్జీవన్‌రామ్ చేసినకృషి అందరికీ స్ఫూర్తిదాయకమని డీఈవో అబ్రహం అన్నారు. ఏలూరు సెయింట్ గ్జేవియర్ హైస్కూలు క్యాంపులో జరుగుతున్న పదోతరగతి మూల్యాంకన శిబిరంలో డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. స్పాట్ విధుల్లోవున్న సుమారు 12వందల మంది టీచర్లకు డీపీఆర్టీయూ నాయకులు మజ్జిగను పంపిణీ చేశారు. సంఘ నాయకులు అచ్యుతరావు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శ్రీకాంత్, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్ బుదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు.
- ఉంగుటూరు : ఉంగుటూరు మండలం ఉంగుటూరు, నారాయణపురం, గోపీనాథపట్నం తదితర గ్రామాల్లో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో, నారాయణపురంలో సర్పంచి దిడ్ల అలకనంద ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.
- జంగారెడ్డిగూడెం/కామవరపుకోట/లింగపాలెం/చింతలపూడి : జంగారెడ్డిగూడెం టీడీపీ పట్టణ కార్యాలయం, ఏలూరు రోడ్డులో వున్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, పగడం సౌభాగ్యవతి, పాతూరి అంబేద్కర్, మండవ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు. శ్రీనివాసపురంలో జగ్జీవన్‌రామ్ యువజన సంఘం అధ్యక్షుడు జొన్నకూటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో, జంగారెడ్డిగూడెం దళిత వాడ, నవచైతన్య అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కామవరపుకోట మండలం వీరిశెట్టి వారిగూడెంలో ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి భారతాల రమేష్ మాదిగ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. ప్రజలకు మహాఅన్నదానం నిర్వహించారు. లింగపాలెం మండలంలో టీడీపీ చింతలపూడి కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, ముసునూరి రాము, తదితరులు పాల్గొన్నారు. చింతలపూడి మారుతీనగర్‌లో ఎన్డీఏ కూటమి నాయకుల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోడా నాగభూషణం, మారుమూడి థామస్, పి.నాగవిజయ్‌కుమార్, ఆనంద్, భారతి, అనిష్‌కుమార్ పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విజయ, ఎస్.ఎస్ రాజేంద్ర తదితరుల ఆధ్వర్యంలో ర్యాలీగా పాత బస్టాండు వరకు నినాదాలతో పాల్గొన్నారు.
- బుట్టాయగూడెం/టి.నరసాపురం/పోలవరం : బుట్టాయగూడెం మండలం బుట్టాయగూడెంలో జగజ్జీవన్‌రాయ్ జయంతి వేడుకలను కేవీపీఎస్ డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నాయకుడు అందుగుల ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. టి.నరసాపురం మండలం కె.జగ్గవరంలో జగ్జీవన్‌రామ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు జగ్జీవన్‌రామ్ నివాళులు అర్పించారు. పోలవరం మండలంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, పంచాయతీ కార్యాలయ ఆవరణ బయట వున్న జగజ్జీవన్ రామ్ విగ్రహానికి అభ్యుదయ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎల్లండీపేటలో ఎమ్మార్పీఎస్ నేత కూనపాము వెంకటేష్ తదితరులు కేక్ కట్ చేసి పులిహోర పంపిణీ చేశారు.
- కుక్కునూరు: కుక్కునూరు మండలం సీతారామనగరంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. దళిత సంఘాల నాయకులు మడిపల్లి రమణయ్య, కొమ్ము వీరబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజులు, వడ్డే రఘు, మడకం వీరయ్య, బాణాల వీరాచారి పాల్గొన్నారు.
- పెదపాడు : పెదపాడు మండలం ఏపూరు గ్రామంలో మాజీ ఎంపీపీ నిమ్మకూరి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ఏలూరులో బడేటి చంటి, ఎంఆర్‌డీ బలరాం దంపతులు.. వెంకన్న సన్నిధిలో సొంగా, పుట్టా పూజలు.. సిద్ధాపురంలో జనంలోకి జనసేనలో ధర్మరాజు

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

టీడీపీ ఏలూరు కూటమి అభ్యర్థి బడేటి చంటి

ఏలూరు రూరల్, ఏప్రిల్ 5:టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ప్రజా ఆరోగ్యానికి సైకిల్ ఎంత మేలు చేస్తుందో, అదేవిధంగా అభివృద్ధి, సంక్షేమానికి అంతకంటే ఎక్కువగా టీడీపీ పెద్దపీట వేస్తుందని ఏలూరు అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. ఏలూరు ఏడో డివిజన్ పంటకాల్వ రోడ్డులోను, 28వ డివిజన్ రాజనాల సుబ్బారావు వీధిలో శుక్రవారం ప్రజాగళం నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ మంత్రి మరడాని రంగారావు, ఎమ్మార్డీ బలరాంతో కలిసి ఆయన పాల్గొన్నారు. మాజీ మంత్రి మరడాని రంగారావు, మధ్యాహ్నపు బలరాం మాట్లాడుతూ పాలన చేతకాని సీఎం జగన్ అన్నివర్గాలను మోసం చేస్తున్నారని, ఆయనపై నమ్మకం సడలిన చాలామంది వైసీపీని వీడుతున్నారన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

లింగపాలెం, ఏప్రిల్ 5: ధర్మాజీగూడెం శివారు వలసపల్లి అడ్డరోడ్డు వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీడీపీ చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్, ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్‌యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలని కోరారు. ముసునూరి రాము, మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, ముసునూరి రాము, గారపాటి బుజ్జియ్య గుత్తా సత్యసాయివరప్రసాద్, మోరంపూడి ప్రసాద్, పిల్లల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాపురంలో పత్సమట్ల ధర్మరాజు ప్రచారం

నిడమర్రు, ఏప్రిల్ 5 :గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ఏర్పడనుందని ఉంగుటూరు నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం సిద్ధాపురంలో జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గన్ని గోపాలంతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి కూటమి మేనిఫెస్టో పది అంశాలను ప్రచారం చేసి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. టీడీపీ నాయకులు ముత్యాలస్వామి, ముత్యాల పెదబాబు, ఆదిరెడ్డి చంద్రరావు, అంబళ్ల విజయ భాస్కర్, పొత్తూరి నరసింహరాజు, పసుపులేటి సతీష్, పోశింశెట్టి రామ్మూర్తి, నిమ్మల దొరబాబు, గఫార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో ధర్మరాజు, గన్ని

నిడమర్రు, ఏప్రిల్ 5 : క్రొవ్విడి మసీదులో జరిగిన ఇఫ్తార్ వేడుకలలో ముఖ్యఅతిథులుగా ఉంగుటూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు హాజరయ్యారు. ఇమామ్ గురువు మహ్మద్ అబ్దుల్ వహీద్ ఆధ్వర్యంలో ప్రార్థనల్లో పాల్గొన్నారు.

శ్రీవారికి మహేష్ పూజలు



ద్వారకాతిరుమల, ఏప్రిల్ 5: చిన్నతిరుమలేశుని ఆలయాన్ని ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.అర్చకుల నుంచి శ్రీవారి శేషవస్త్రం, ఆశీర్వచనం అందుకున్నారు. ఆయనకు టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కూరాకుల బుజ్జి యాదవ్, కాట్రు బాలు, ముమ్మిడి చింతయ్య, బాబి, తదితరులు స్వాగతం పలికారు.

రానున్నది కూటమి ప్రభుత్వమే..

చింతలపూడి, ఏప్రిల్ 5: రానున్నది కూటమి ప్రభుత్వమేనని ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టామహేష్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం చింతలపూడిలో ఆత్మీయ పరిచయ వేదిక నిర్వహించారు. తొలుత పార్టీ కార్యాలయం నుంచి అభ్యర్థులు ర్యాలీగా సభావేదికకు చేరుకున్నారు. బట్టువారిగూడెం, పాత చింతలపూడి, బోయగూడెంకు చెందిన పలువురు వైసీపీలో నుంచి టీడీపీలోకి చేరడంతో వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. వేదికపై అసెంబ్లీ అభ్యర్థి రోషన్‌కుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఐశ్వర్య, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, బీజేపీ నాయకుడు వరప్రసాద్, దాసరి శ్యామ్‌చంద్రశేషు తదితరులు పాల్గొన్నారు.

దాడులు, దౌర్జన్యాలే వైసీపీ దినచర్య

రాయన్నపాలెంలో జయహో బీసీ సదస్సులో చింతమనేని


ప్రభాకర్‌ను సత్కరిస్తున్న నాయకులు

పెదవేగి, ఏప్రిల్ 5 :నా బీసీలు, నా ఎస్సీలు అంటూ మభ్యపెట్టే జగన్‌రెడ్డి బీసీలు, ఎస్సీలకు చేసిందేమీ లేదని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విమర్శించారు. రాయన్నపాలెంలో శుక్రవారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను గజమాలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ పేరు చెప్పుకుంటూ వారిపైనే దాడులు, దౌర్జన్యాలతో దినచర్యను ప్రారంభిస్తూ, హత్యలకు పాల్పడే నైజం జగన్‌దని ఎద్దేవా చేశారు. బీసీల సంక్షేమం కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన జగన్, ఒక్క రూపాయి కూడా బీసీలకు కేటాయించలేదన్నారు. వైసీపీ అసమర్థ పాలనతో ప్రజలు విసుగెత్తారని, టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమనే నమ్మకంతో పార్టీలోకి జనం క్యూ కడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, మంచినేని శ్రీనివాసరావు, పర్వతనేని ప్రభాకర్, తాతా సత్యనారాయణ, పామర్తి నాగభూషణం, శొంఠి మురళీకృష్ణ, శిరుగుబత్తు ఏడుకొండలు, మట్టా వెంకటాద్రి, మన్నే భుజంగ రావు, లావేటి శ్రీనివాస రావు, తలకొండ జమలయ్య, కొనకళ్ళ శివమణి, మాదు రవికుమార్, దారిబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేత కమ్మ శివరామకృష్ణ

దెందులూరు,ఏప్రిల్ 5 : దెందులూరు నియోజకవర్గానికి చెందిన వైసీపీ కీలక నేత, టీమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కమ్మ శివరామకృష్ణ నల్లజర్ల ప్రజాగళం యాత్రలో వున్న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును కలిసి పార్టీలో చేరారు. దెందులూరు మండలం చల్లచింతలపూడికి చెందిన వైసీపీ కీలక నేతైన ఆయన మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి వచ్చి పార్టీలో చేరారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక.. రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబుతోనే సాధ్యమనే నమ్మకంతో పార్టీలో చేరానన్నారు. ఎమ్మెల్యేగా చింతమనేని ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని పార్టీ అధినేత చంద్రబాబుకు హామీ ఇచ్చానన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలి

డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు


కరాటం రాంబాబు సమక్షంలో జనసేనలో నాయకులు

కొయ్యలగూడెం, ఏప్రిల్ 5: రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు పిలుపునిచ్చారు. మండలంలోని పొంగుటూరు, కన్నాయిగూడెం, తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. పొంగుటూరులో సుమారు వంద మంది పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావాలన్న, అమరావతి పూర్తి కావాలన్న బీజేపీ, టీడీపీ, జనసేన కూటమితోనే సాధ్యమన్నారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతంతో పాటు ఆంధ్రరాష్ట్రం సస్యశ్యామలం అవుతుందన్నారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి మహేష్‌యాదవ్, పోలవరం జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజులను గెలిపించాలని కోరారు. జనసేన మండల అధ్యక్షుడు తోట రవి, దుగ్గిన శ్రీను, కొడవటి రామకృష్ణ, రాజనాల సత్యనారాయణ, గేలం భాస్కర్, టీడీపీ నాయకురాలు గంగిరెడ్ల మేఘలాదేవి, మేకల తేజ, తదితరులు పాల్గొన్నారు.

'జగన్ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం'


మాట్లాడుతున్న యునైటెడ్ ఫ్రంట్ నాయకులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 5: సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని ఎక్కడా అభివృద్ధి జరగలేదని ఏపీ యునైటెడ్ ఫ్రంట్ నాయకులు అన్నారు. శుక్రవారం ఏలూరులో రాష్ట్రంలోని జైభారత్ నేషనల్ పార్టీ, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ, ప్రభుదా రిపబ్లిక్ పార్టీ, నవరన్ కాంగ్రెస్ పార్టీ, నీతి నిజాయతీ పార్టీ, ఆల్ తెలుగు ప్రజాపార్టీలు ఏపీ యునైటెడ్ ఫ్రంట్‌గా ఏర్పాటయ్యాయి. నవరన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్కే జెలిల్ మాట్లాడుతూ దేశంలో 543 పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఏపీ యునైటెడ్ ఫ్రంట్ తరపున అభ్యర్థులు పోటీ చేస్తున్నారని తెలిపారు. వైఎస్ జగన్ పాలనలో అమరావతి రాజధానిని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. మళ్లీ తానే సీఎం అవుతానని పగటి కలలు కంటున్నారని మండిపడ్డారు. అనంతరం ఫ్రంట్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ రఘుమల్లేపల్లి రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి జరగాలంటే యునైటెడ్ ఫ్రంట్‌లోని అభ్యర్థులను గెలిపించాలన్నారు. పి.రవీంద్రనాథ్, నేకుటేయ్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ ఆలయ ప్రతిష్ఠ


కనకదుర్గమ్మ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కొయ్యలగూడెం, ఏప్రిల్ 5: కొయ్యలగూడెం పట్టణంలో పురాతన ఆలయమైన కనకదుర్గమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శిం చుకున్నారు. ఆలయ కమిటీ వారు భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ


ఏలూరులో మెడికల్ సిబ్బంది ర్యాలీ

ఏలూరు రూరల్/బుట్టాయగూడెం/ఉంగుటూరు, ఏప్రిల్ 5 : ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ సాధ్యమవుతుం దని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. ఏలూరు సత్రంపాడు ఎమ్మార్సీ కాలనీలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్ఈవో ఎం.పార్వతీశం, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, ఆరోగ్యకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. బుట్టాయగూడెం మండలం దొరమామిడి పీహెచ్‌సీ పరిధిలోని గొట్టాలరేవుకు చెందిన గురుగుంట్ల గంగిరెడ్డి అనే కొండరెడ్డి గిరిజనుడికి జ్వరం రావడంతో రక్తపరీక్షలు చేయగా మలేరియా అని తేలడంతో వైద్యసేవలు అందించడంతోపాటు గ్రామంలో శుక్రవారం మలాథియన్ దోమలమందును స్ప్రేయింగ్ చేశామని సబ్ యూనిట్ ఆఫీసర్ వి.పెద్దిరాజు తెలిపారు. గ్రామంలో వైద్యశిబిరాన్ని నిర్వహించి మందులు పంపిణీ చేశామని డ్రైడే ఫ్రైడేలో భాగంగా జ్వరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించామన్నారు. సీహెచ్‌వో రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ సాయి ప్రమోదిని సిబ్బంది పాల్గొన్నారు. ఉంగుటూరు మండలం ఉంగుటూరు-1,2 సచివాలయాల పరిధిలో శుక్రవారం తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఉప ఆరోగ్యాధికారి వై.వీ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ఆరోగ్య కార్యకర్తలు ఎస్తేరు, ఆశా కార్యకర్తలు శ్యామల, లక్ష్మీకుమారి, దేవి పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలే : ఎస్ఐ

పెదవేగి, ఏప్రిల్ 5 : ఎన్నికల్లో నియమ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం న్యాయంపల్లిలో ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలో ప్రశాంత వాతావరణానికి భంగం కల్గిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. నిబంధనలు మీరి, పార్టీ జెండాలు, బ్యానర్లు వంటివి అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సభలు, సమావేశాలు, మైక్‌ల ఏర్పాటుకు ముందస్తు అనుమతి తప్పనిసరన్నారు.

వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న రత్నప్రసాద్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 5 : నేటి సమాజం అభివృద్ధి చెందుతున్నప్ప టికీ వెట్టిచాకిరీ, బాలకార్మిక వ్యవస్థ కొనసాగుతుందని దీని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రత్నప్రసాద్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 'వెట్టిచాకిరి నిర్మూలన బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన'పై శుక్రవారం ఏలూరులో పోలీస్, రెవెన్యూ, కార్మిక, సీడబ్ల్యూసీల ఆధ్వర్యంలో నగరంలో ఏలూరు దిశ పోలీస్ స్టేషన్ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్ ప్రారంభించారు. డీసీపీవో సీహెచ్ సూర్యచక్రవేణి మాట్లాడుతూ ఎక్కడైనా బాల కార్మికులు ఉన్నట్టు తెలిస్తే 1098కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. బాధితులకు రక్షణ పునరావాసం ఏర్పాటు చేయడమే కాకుండా సంబంధిత వ్యక్తులకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దిశ ఇన్‌స్పెక్టర్ విశ్వం, దిశ ఎస్.కాంతిప్రియ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గోపాలకృష్ణారావు, న్యాయవాదులు కూనా కృష్ణారావు, జీవీ భాస్కర్ పలువురు పాల్గొన్నారు.

సీతారామాలయంలో రచయిత శ్రీరామ్ పూజలు



ఉంగుటూరు, ఏప్రిల్ 5: ఆధ్యాత్మిక కతకు ప్రతిరూపంగా సుందర సీతారా మాలయం రూపుదిద్దుకుందని గేయ రచయిత అనంత శ్రీరామ్ కొనియాడా రు. కైకరంలోని శ్రీసుందర సీతారామా లయాన్ని శుక్రవారం ఆయనతో పాటు ఎన్ఆర్ఐ పంచకర్ల రఘు సందర్శించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి, శ్రీరాముడి చిత్రపటాలను అందించారు. ఆలయ కమిటీ తరపున కూనా అప్పారావు, కొచ్చర్లకోట శ్రీనివాసరావు, యండ రామదాసు పాల్గొన్నారు.




నూజివీడు, యనమదలలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులు




ముసునూరు, తుమ్మగూడెంలలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులు



చేవూరులో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



ముదినేపల్లి దళిత సంఘాల కార్యాలయంలో నివాళులు

బడుగుల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

» యువత ఆదర్శంగా తీసుకోవాలని వక్తల సూచన » ఘనంగా నివాళులు

నూజివీడు, ఏప్రిల్ 5: జగ్జీవన్‌రామ్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు టీడీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రప టానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి ఉపప్రధాని స్థాయికి ఎదిగిన నిస్వార్థ రాజకీయ నాయకుడు జగ్జీవన్‌రామ్ అన్నారు. కార్మిక శాఖ మంత్రిగా అనేక కార్మిక సంక్షేమ చట్టాలను అమల్లోకి తెచ్చిన ఘనత ఆయనదేనన్నారు. రక్షణశాఖామంత్రిగా దేశ రక్షణను పటిష్ఠంచేసి వ్యవసాయశాఖ మంత్రిగా హైబ్రీడ్ వంగడాలను సాగులోకి తీసుకువచ్చారన్నారు. ఆయన స్ఫూర్తితో రాష్ట్రాన్ని అభివృద్ధిచేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, టీడీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు నూతక్కి వేణుగోపాలరావు, బీజేపీ నాయకుడు బోను అప్పారావు తదితరులు పాల్గొన్నారు. నూజివీడులోని తన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన స్ఫూర్తిగా బడుగు, బలహీనవర్గాలు రాజ్యాధికారాన్ని సాధిస్తేనే నిజమైన అభివృద్ధి వారికి అందుతుందన్నారు.

నూజివీడు టౌన్: నూజివీడు మండలం యనమదలలో టీడీపీ నూజివీడు మండల అధ్యక్షుడు ముసునూరి రాజా, గ్రామ మాజీ సర్పంచ్ పల్లెర్లమూడి రామోజీ, నియోజకవర్గ నాయకుడు నూతక్కి వేణుగోపాలరావు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. వార్డు సభ్యులు పరికూటి భవాని, శారదాబాయ్, ధర్మారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, స్వతంత్ర సమరయోధుడిగా, ఉప ప్రధానిగా దేశసేవకు అంకితమైన నాయకుడు జగ్జీవన్‌రామ్ అని బీజేపీ మండల అధ్యక్షుడు కొవ్వలి బాబూరావు నివాళులర్పించారు. ఆగిరిపల్లిలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో నాయకులు కలపాల రాంబాబు, చిత్తూరు వెంగళరావు, కొవ్వలి రాజారావు, డెన్ని రాజు తదితరులు పాల్గొన్నారు.




మండవల్లి, ఆగిరిపల్లిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు

ముసునూరు: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మియా, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు దుబ్బాక దేవరాజ్ అన్నారు. మండల వ్యాప్తంగా శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముసునూరు ఎస్సీ కాలనీలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సర్పంచ్, ఎంపీటీసీ చీలి లక్ష్మి, ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమణక్కపేటలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆముదాల ఇస్సాకు, ఎమ్మార్పీఎస్ నాయకులు, లోపూడిలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి డోలా రాంబాబు, నాయకులు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మేడూరి సర్వేసు, సి.అర్లప్ప, కొడవలి మోజేష్, కొమ్ముకూరి జార్జి, దేవరపల్లి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా హెచ్‌ఎం వెంకట్రావు, విద్యార్థులు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళితులు విద్య, ఉద్యోగ, సామాజిక రంగాల్లో అభివృద్ధి చెందటానికి జగ్జీవన్‌రామ్ చేసిన కృషిని హెచ్‌ఎం విద్యార్థులకు వివరించారు.

ముదినేపల్లి: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ముదినేపల్లి మండలంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. చేవూరులోని ఆయన విగ్రహానికి టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పంతగాని సురేష్, దావు నాగరాజు, పాతూరి వంశీకృష్ణ, కత్తి సుధీర్, బూరుబోయిన బాలాజీ, వీరంకి చక్రపాణి, జనసేన నాయకులు మోటేపల్లి హనుమ, వడ్లాని ఆంజనేయులు, బత్తుల గోపి, వైస్ ఎంపీపీ చొప్పర్ల సునీత తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదినేపల్లిలోని దళిత సంఘాల కార్యాలయంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు శావా నాగ జగన్ బాబూరావు, మాదిగ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసుపోగు దానియేలు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కలిదిండి: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన బాబూ జగ్జీవన్ రామ్ చిరస్మరణీయుడని వక్తలు కొనియాడారు. కలిదిండిలో దళిత సంక్షేమ సంఘ నాయకులు కురేళ్ల ఏడుకొండలు, బళ్ల రాజు, ఈదా దుర్గారావు, ఆశీర్వాదం, లేళ్ల సుబ్బారావు, ఈదా పద్మారావు తదితరులు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మండవల్లి: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శుక్రవారం మండవల్లి సెంటర్లో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, అధ్యక్షుడు శాంతరాజు, చాబత్తిన విజయ్, గోరింక గాంధీ, బేతపూడి తంబిదాస్, దాకరపు వినోద్‌కుమార్, ఒట్టిప్రోలు సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. పెదపాలపర్రు గ్రామంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మండల టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి, గ్రామ సర్పంచ్ గంటా రాకేష్ కుమార్‌లు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.



అరుంధతికాలనీలో వేసిన నూతన పైప్‌లైన్ దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాగునీటి సమస్యకు పరిష్కారం

ముసునూరు, ఏప్రిల్ 5: రమణక్కపేట పంచాయతీలోని అరుంధతి కాలనీలో తాగునీటి సమస్య ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో పరిష్కారమైంది. గురువారం కాలనీలో ఉన్న పాత పైప్‌లైన్‌ను తొలగించి పనులు పూర్తిచేసి శుక్రవారం నూతన పైప్‌లైన్‌ను వేసి కాలనీలో ఉన్న ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చారు. దీంతో కాలనీలో సమృద్ధిగా నీరు సరఫరా అయింది. వరుస కథనాలతో తమకు తాగునీరు అందేలా చేసిన ఆంధ్రజ్యోతికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధుడి మృతిపై నివేదిక కోరిన కలెక్టర్

చాట్రాయి, ఏప్రిల్ 5: మండలంలోని చీపురుగూడెంలో వడదెబ్బకు పింఛనుదారు మేకల తిరుపతయ్య మృతిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్పందించారు. నివేదిక ఇవ్వాలని ఎంపీడీవోను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో మంగాకుమారి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు చీపురుగూడెం వచ్చి కుటుంబ సభ్యులు, గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించి కలెక్టర్‌కి నివేదిక పంపారు.

నీటి అజమాయిషీకి కమిటీలు : ఎంపీడీవో

ముదినేపల్లి, ఏప్రిల్ 5 : తాగునీటి అవసరాలకు విడుదల చేస్తున్న నీరు ప్రధాన పంట కాల్వల నుంచి గ్రామాల్లోని మంచినీటి చెరువులకు తరలింపును పర్యవేక్షించేందుకు ముదినేపల్లి మండలంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో మురళీ గంగాధరరావు తెలిపారు. ఈ నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించేలా కమిటీలు జాగ్రత్తలు తీసుకుంటాయన్నారు. కమిటీల్లో పంచాయతీ కార్యదర్శితోపాటు సచివాలయ, పోలీసు సిబ్బంది ఉంటారన్నారు. కాల్వల నుంచి నీటిని ఆక్వా చెరువులకు తరలించకుండా ఏర్పాట్లు చేశామన్నారు. చెరువులకు నీటిని ఇంజన్ల ద్వారా తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామని తెలిపారు. మరో నాలుగు రోజుల్లో కాల్వలకు నీరు విడుదల కానున్నందున చెరువులకు నీరు నింపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

'రాజకీయ ఒత్తిడిలేని వ్యక్తికి అధికారం రావాలి'

ఆగిరిపల్లి, ఏప్రిల్ 5: ఎటువంటి రాజకీయ ఒత్తిడి లేకుండా ఉండే వ్యక్తికి అధికారం వస్తేనే అభివృద్ధి జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఆగిరిపల్లి మండలం సీతారాంపురం, కొత్త ఈదర, పాత ఈదర గ్రామాల్లో ఆయన ఆత్మీయ సమావేశం, ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలు నేటికీ కనీస వసతులకు దూరంగా ఉన్నాయన్నారు. తాను అధికారంలోకి వస్తే గ్రామంలో మురుగునీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి, సీసీ రోడ్లను వేయిస్తానని హామీ ఇచ్చారు.

నచ్చినవారికి ఓటేయనివ్వరా..?



శృంగవరప్పాడులో సమావేశం అడ్డుకుంటున్న పోలీసులు

వైసీపీకి ఓటు వేయాలని సర్పంచ్ భర్త ఒత్తిడి

తమకు నచ్చినవారికి వేస్తామన్న పలువురు.. వాగ్వాదం

శృంగవరప్పాడు గ్రామ సమావేశాన్ని అడ్డుకున్న పోలీసులు

కైకలూరు, ఏప్రిల్ 5: కొల్లేరు గ్రామాల కట్టుబాట్ల మధ్య ఒక పార్టీకే మద్దతు తెలపాలని కొంతమంది నాయకులు చేస్తున్న ప్రయత్నాలకు పోలీసులు సైతం పరోక్షంగా మద్దతు తెలపడం విమర్శలకు తావిస్తోంది. గురువారం రాత్రి కైకలూరు మండలం శృంగవరప్పాడులో గ్రామ సమావేశాన్ని నిర్వహించారు. గతంలో వైఎస్సార్ సంపూర్ణ గ్రామాలుగా ప్రకటించి ప్రజలు మద్దతు ఇచ్చారు. అయితే ఆశించిన మేర గ్రామ అభివృద్ధి జరగలేదని, సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛగా తమకు నచ్చిన వారికి ఓటు వేసుకుంటామని సమావేశంలో పలువురు పేర్కొన్నారు. దీంతో సర్పంచ్ ఘంటసాల భాగ్యలక్ష్మి భర్త జగన్నాథం దానికి ఒప్పుకోమని వైఎస్సార్ సంపూర్ణ గ్రామాలుగానే ఉండాలని పట్టుబట్టారు. గ్రామ కట్టుబాట్ల మధ్య తీసుకునే నిర్ణయాలకు వ్యతిరేకంగా ఒక వర్గం పట్టుబట్టి అధికార పక్షానికి పట్టం కట్టాలని ప్రయత్నించడాన్ని తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. సమావేశం జరుగుతున్న సమాచారం తెలుసుకున్న కైకలూరు రూరల్ పోలీసులు రంగప్రవేశం చేసి సమావేశాన్ని మధ్యలోనే నిలిపివేశారు. అనుమతులేకుండా సమావేశాలు నిర్వహించవద్దంటూ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గ్రామస్థులు ఒక వర్గం చెప్పిన విధంగా ఓట్లు వేయాలనడం తగదని ఎన్నికల సమావేశం కాదని గ్రామ సమావేశం మాత్రమే నిర్వహిస్తున్నామని దీనిని పోలీసులు అడ్డుకోవడం సబబు కాదని పదేపదే వారించారు. గ్రామాన్ని వైఎస్సార్ సంపూర్ణ గ్రామంగా తీసేసి ఎవరికి నచ్చిన విధంగా వారికి ఓటు వేసుకునే విధంగా ఉండాలన్నారు. పోలీసులు సమావేశం జరిగేందుకు ఒప్పు కోకపోవడంతో వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగానే పోలీసులను పంపించారని పోలీసులు సైతం అధికార పక్షానికి మొగ్గు చూపుతూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. దీంతో గ్రామస్థులు పోలీసులపై తోపులాటకు దిగారు. సమావేశం అర్ధంతరంగా ముగిసింది. తాము స్వేచ్ఛగా ఓటేసేలా ఎన్నికల కమిషన్ చర్యలు చూడాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.



కృష్ణబాబుకు కండువా కప్పి కూటమిలో ఆహ్వానిస్తున్న కామినేని

కలిదిండిలో వైసీపీకి షాక్

కూటమిలో చేరిన నున్న కృష్ణబాబు

కైకలూరు, ఏప్రిల్ 5: బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం కైకలూరు మండలం వరహాపట్నంలోని ఆయన నివాసంలో వైసీపీ సీనియర్ నేత, కొండంగి ఎత్తిపోతల పథకం కమిటీ చైర్మన్ నున్న కృష్ణబాబు ఆ పార్టీని వీడి టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు ఆధ్వర్యంలో కూటమిలో చేరారు. ఈ సందర్భంగా కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్, కైకలూరు నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు కోరి వైసీపీ నుంచి నున్న కృష్ణబాబు ఎన్డీయే కూటమిలో చేరడం అభినందనీయమన్నారు. భవిష్యత్ తరాల ప్రజలకు మేలు చేసేందుకు మరింత మంది నాయకులు కూటమిలోకి రావాలని పిలుపునిచ్చారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ రమాదేవి, జనసేన నాయకుడు నల్లగోపుల చలపతి, కూటమి నాయకులు పైడిపాటి శివశంకర్, బూరుబోయిన శ్రీనివాసరావు, బోయిన శ్రీనివాసరావు, బోయిన శివాజీ, పళ్లెం తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడులకు లొంగకుండా ఓటేయండి..

చాట్రాయి, ఏప్రిల్ 5: మండలంలోని చనుబండ, నరసింహారావుపాలెం గ్రామాల్లో శుక్రవారం ఎస్సై కేసీహెచ్ స్వామి, ఏఎస్సై గజపతిరావు ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఓటుహక్కును తప్పని సరిగా వినియోగించుకోవాలని, ఎటువంటి ప్రలోభాలు, ఒత్తిడులకు లొంగకుండా మంచి ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని సూచించారు.



నరసింహారావుపాలెంలో ఫ్లాగ్ మార్చ్

ఎన్నికల నియమావళిని పాటించాలి..

ముసునూరు, ఏప్రిల్ 5: ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పొలిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ముసునూరు శివారు నేలపాటివారికుంట వద్ద ఆయన వాహనాల విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల్లో అక్రమంగా నగదు, మద్యం, ఇతర తాయిలాలు రవాణా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సరిహద్దు చెక్ పోస్టులు తనిఖీ చేసిన సీఐ

చాట్రాయి, ఏప్రిల్ 5: తెలంగాణ సరిహద్దులో ఉన్న మండలంలోని కృష్ణారావుపాలెం, పర్వతాపురం చెక్‌పోస్టులను శుక్రవారం సీసీఎస్ సీఐ మురళీకృష్ణ ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బందితో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చెయ్యాలని, మద్యం, నగదు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సూచించారు.

ఓటు హక్కు వినియోగంపై కళాజాత ప్రదర్శన

మండవల్లి, ఏప్రిల్ 5: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కళాజాత బృందం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని తక్కెళ్లపాడులో ఏలూరుకు చెందిన కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారుల బృందం ఆధ్వర్యంలో ఓటింగ్ శాతం పెంచేందుకు కళాజాత బృందం ప్రదర్శనతో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ బాధ్యాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.



చిన్నంపేటలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

చాట్రాయి, ఏప్రిల్ 5: మండలంలోని చిన్నంపేట గ్రామంలో నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి సమక్షంలో గురువారం రాత్రి వైసీపీకి చెందిన కొమ్ము సుజనరావు, షారోను, కారుమంచి విశ్వేశ్వరరావు, టి. ముక్కయ్య, ప్రశాంత్‌కుమార్, అశోక్, అర్జున్, నవీన్, ముత్తయ్య, పుల్లయ్య, అబ్రహం, బాబూరావు టీడీపీలో చేరారు. వీరికి పార్థసారథి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసి కూటమి విజయానికి పాటుపడాలని సారథి కోరారు.

నేడు 'జయహో బీసీ' విజయవంతం చేయాలి

ఆగిరిపల్లి, ఏప్రిల్ 5: ఆగిరిపల్లిలో జయహో బీసీ భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం ఆగిరిపల్లి బ్రాహ్మణ బజారులో జరగనున్న ఈ సభకు నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి పాల్గొంటారని, వేలాదిగా ప్రజలు విచ్చేసి జయప్రదం చేయాలని నూజివీడు టీడీపీ కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పార్థసారథి సతీమణి లక్ష్మీకమల



ఆచవరంలో మాజీ జడ్పీటీసీ బొమ్మనబోయిన విజయలక్ష్మి ప్రచారం



తామరకొల్లులో టీడీపీ నేతల ప్రచారం



పడమటిపాలెంలో టీడీపీ శ్రేణుల ప్రచారం

ప్రచారాల జోరు..



చిన్నంపేటలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పార్థసారథి

రాష్ట్రాభివృద్ధిని దూరం చేసిన జగన్

నూజివీడు టౌన్, ఏప్రిల్ 5: జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధికి దూరం చేశారని, నూజివీడు కూటమి అభ్యర్థి పార్థసారథి సతీమణి లక్ష్మీకమల అన్నారు. నూజివీడు పట్టణంలోని మూడో వార్డులో ఆమె తెలుగు మహిళలతో కలసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. జగన్ సీఎం అయ్యాక విద్యుత్‌చార్జీలు మొదలుకొని ఇంట్లో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయన్నారు. జగన్‌రెడ్డి ఒక చేత్తో రూపాయి ఇచ్చి మరో చేత్తో రూ.100లు వసూలు చేస్తున్నారన్నారు. మాజీ కౌన్సిలర్లు గొల్లు దుర్గాదేవి, కొంపెల్ల కృష్ణకుమారి, నూజివీడు పట్టణ టీడీపీ కార్యదర్శి పి.నాగ రాజు, పట్టణ మాజీ అధ్యక్షుడు లాయర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు వైసీపీ తీరని ద్రోహం

కైకలూరు, ఏప్రిల్ 5: గ్రామాల అభివృద్ధికి వైసీపీ తీరని ద్రోహం చేసిందని, ఐదేళ్లలో అభివృద్ధి లేక వెనుకబడిపోయాయని జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బొమ్మనబోయిన విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆచవరం, తామరకొల్లు, కైకలూరు పట్టణంలోని వార్లకోడు కాలువగట్టు వెంబడి ఎన్డీయే కూటమి నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు వైసీపీ పాలనలో జరిగిన అన్యాయం, అక్రమ కేసులు, దందాని ప్రజలకు వివరించారు. గ్రామాలు, రాష్ట్రాభివృద్ధి జరగాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. తామరకొల్లు ప్రచారాల్లో ఎంపీటీసీ గంగుల వెంకటనరసమ్మ, మండల తెలుగుమహిళా అధ్యక్షురాలు గంగుల శ్రీదేవి, టీడీపీ నేతలు నేరెళ్ళ వంశీ, కుర్మా నవీన్, దొడ్డాకుల నాంచారయ్య, గంగుల ఏసురాజు, గంగుల పోతురాజు, మాడపాటి నాగరాజు, మోదుగుమూడి అశోక్, ఆచవరంలో తెలుగు మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, మండల ప్రధాన కార్యదర్శి వి. రాధాకృష్ణ, కైకలూరు మాజీ సర్పంచ్ తెంటు నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ నాయకులు వీరాబత్తిన సుధా, పార్టీ గ్రామ నాయకులు తలారి చినసీతారామయ్య, ఏకుల కిట్టయ్య, నాగబోయిన పాండు, కైకలూరులో జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్, షైగాపుల ఆంజనేయులు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, తెలుగు మహిళా కార్యదర్శి శీలం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తిదారులకు బీసీ కార్పొరేషన్ రుణాలు

చాట్రాయి, ఏప్రిల్ 5: కూటమి అధికారంలోకి రాగానే గొర్రెలు మేకల పెంపకందారులు, గీత కార్మికులు తదితర కుల వృత్తిదారులకు బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయటంతో పాటు, 50 ఏళ్ళు నిండిన బీసీలకు రూ. 4 వేలు పింఛను ఇస్తామని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి తెలిపారు. గురువారం రాత్రి మండలంలో చిన్నంపేట, పర్వతాపురం గ్రామాల్లో జరిగిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తామని, ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేసి ఫ్లోరైడ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. ప్రజలు, నాయకులు గ్రామాల్లోని సమస్యలను పార్థసారథికి వివరించారు. టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, అత్తులూరి శ్రీనివాసరావు, మరిడి చిట్టిబాబు, నోబుల్‌రెడ్డి వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నీతివంతమైన పాలనే కూటమి ధ్యేయం

ముదినేపల్లి: నీతివంతమైన పాలన అందించటమే కూటమి ధ్యేయమని తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు అన్నారు. ముదినేపల్లి మండలం అల్లూరులో శుక్రవారం ఏలూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, కైకలూరు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ తరపున ఆయన టీడీపీ నాయకులతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సుపరిపాలనకు ఓటర్లు కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు నీలిపల్లి సన్యాసిరావు, దాసరి శ్రీను, పత్తి శివశంకర్, బొమ్మనబోయిన రత్నం, ముండ్రు బాలరాజు, సింగరాతి సత్యనారాయణ తదితరులు ఇంటింటా మేనిఫెస్టోను పంపిణీ చేశారు.

కలిదిండి: పడమటిపాలెంలో టీడీపీ శ్రేణులు శుక్రవారం కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు ఓటు వేయాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ ఎంపీటీసీ సుధాబత్తుల రాధా కుమారి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు బి. రాజు, ఎస్.ఆర్పీ అగ్రహారం సర్పంచ్ వెంకట స్వామి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



చావలిపాడులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

మండవల్లి: చావలిపాడులో టీడీపీ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కామినేని శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సజ్జ బాబి, గజ్జల గణేష్, చెన్నంశెట్టి నందకిషోర్, కూనపురెడ్డి కోటేశ్వరరావు, వీరవల్లి శివయ్య, జి. గణేష్, తలారి రాజేష్, గూడవల్లి లక్ష్మణరావు, తలారి పోతురాజు, తలారి మధు, తలారి సత్యనారాయణ, మాడపాటి శ్యామలరావు, తలారి ఆదినారాయణ, మాడపాటి వినోద్, గణేష్, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: కామినేని శ్రీనివాస్ గెలుపునకు గ్రామాల్లో టీడీపీ పార్టీ కార్యకర్తలు కృషిచేయాలని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు దావు నాగరాజు పార్టీ కార్యకర్తలను కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డాక్టర్ కామినేని శ్రీనివాస్ గతంలో మంత్రిగా నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేశారని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు నియంతృత్వ పోకడకు అడ్డుకట్ట వేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తేగల సత్తా కామినేనికి ఉందన్నారు.